
సాక్షి
నాగర్‌కర్నూల్
సోమవారం ၊ 11 ၊ డిసెంబర్ ၊ 2023



విశేష స్పందన

'సాక్షి' ఆధ్వర్యంలో నిర్వహించిన స్పెల్–బీ, మ్యాథ్స్–జీకి విశేష స్పందన వచ్చింది.

వివరాలు 8లో ▸



పదవీ గండమేనా?

కొత్త ప్రభుత్వం ఏర్పాటుతో నామినేటెడ్ పదవులకు గండం వాటిల్లుతోంది.

వివరాలు 10లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
33.0 /15.6

అప్పుడప్పుడు ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఉదయం, రాత్రివేళలో చల్లని గాలులు వీస్తాయి. చలి తీవ్రత పెరుగుతుంది.

న్యూస్‌రీల్

ఆరోగ్యానికి భరోసా..



అచ్చంపేట: ప్రతి పేదవాడికి ఆరోగ్యశ్రీ ఎంతగానో ఉపయోగపడుతుందని, ఆర్యోగశ్రీ ప్యాకేజీ పెంపుతో ప్రభుత్వ ఆస్పత్రుల్లో మౌలిక వసతులకు నిధుల సౌలభ్యం పెరుగుతుందని అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ అన్నారు. ఆదివారం రాత్రి విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. పట్టణంలోని శ్రీశైలం–నాగర్‌కర్నూల్ ప్రధాన రహదారి వెంట కాంగ్రెస్ శ్రేణులు ఏర్పాటు చేసిన విజయోత్సవ ర్యాలీలో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రణాళికలో పేర్కొన్న 6 గ్యారంటీలను ఇచ్చితంగా అమలు చేస్తోందని చెప్పారు. ఇచ్చిన హామీల్లో ఇప్పటికే సీఎం రేవంత్‌రెడ్డి మహాలక్ష్మి పథకం, రాజీవ్ ఆరోగ్యశ్రీ పెంపు రూ.10 లక్షల కార్యక్రమం ప్రారంభించారని చెప్పారు. గత ప్రభుత్వం కంటే ఎంతో మేలు జరిగే పనులు ఈ ప్రభుత్వం అందిస్తుందన్నారు. అనంతరం అచ్చంపేటలోని వంద పడకల ఆస్పత్రిలో రాజీవ్ ఆరోగ్యశ్రీ రూ.10 లక్షల వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. టీపీసీసీ ఉపాధ్యక్షుడు మల్లు రవి, అమ్రాబాద్ జెడ్పీటీసీ సభ్యురాలు అనురాధ, ఎ.గోపాల్‌రెడ్డి, కౌన్సిలర్లు గౌరిశంకర్, సునీత, శ్రీనివాసులు ఉన్నారు.


'ఇంటింటికి తిరిగి వివరాల సేకరణ'

కందనూలు: విద్యాశాఖ ఆదేశానుసారం సోమవారం నుంచి జనవరి 10వ తేదీ వరకు ప్రత్యేక కార్యక్రమం కింద 'బడిబయటి పిల్లలను' గుర్తించే సర్వేను చేపట్టనున్నట్లు జిల్లా అకాడమిక్ మానిటరింగ్ అధికారి ఎండీ షర్ఫొద్దీన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా విద్యాశాఖ అధికారులు ఆ దిశగా చర్యలకు ఉపక్రమించారని, విద్యార్థుల ఉజ్వల భవిష్యత్‌ను తీర్చిదిద్దేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్బంధ విద్యాహక్కు చట్టాన్ని అమలు చేస్తున్నాయన్నారు. ఏటా విద్యాశాఖ రెండు పర్యాయాలు సర్వే చేపడుతుందన్నారు. ఇప్పటికే ఈ ఏడాది జనవరిలో సర్వే నిర్వహించగా.. తాజాగా రెండో విడత సర్వేకు జిల్లా విద్యాశాఖ అధికారులు కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, సీఆర్పీలకు శిక్షణ పూర్తి చేశారన్నారు. నెలరోజుల పాటు విద్యాశాఖ పరిధిలోని సమగ్ర శిక్ష కింద పని చేసే సీఆర్పీలు క్షేత్రస్థాయిలో ఇంటింటా తిరిగి వివరాలు సేకరిస్తారన్నారు. ప్రాథమిక స్థాయిలో 6 నుంచి 19 ఏళ్లలోపు బడీడు పిల్లలను, సెకండరీ స్థాయిలో 15 నుంచి 19 ఏళ్లలోపు పిల్లలను వేర్వేరుగా గుర్తించి జాబితా రూపొందిస్తారన్నారు. వివరాలను సంబంధిత ప్రొఫార్మలో నమోదు చేయాలని, తదనంతరం జాతీయ స్థాయిలో రూపొందించిన ప్రబంధ్ పోర్టల్‌లో రోజు వారీగా నమోదు చేయాలన్నారు.

అవిశ్వాసానికి మొగ్గు!

నూతన ప్రభుత్వం ఏర్పాటుతో మున్సిపాలిటీల్లో మారుతున్న సమీకరణలు

- చైర్మన్ల పదవిపై కన్నేసిన హస్తం
- ఇప్పటికే పార్టీ మారిన కొందరు కౌన్సిలర్లు
- జనవరి 28 నాటికి పూర్తికానున్న నాలుగు సంవత్సరాల నిబంధన
- అప్పటి వరకు మద్దతు కూడగట్టుకునే పనిలో ఉన్న ఆశావహులు



నాగర్‌కర్నూల్: ఇటీవల జరిగిన ఎన్నికల్లో రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడటంతో జిల్లాలోనూ వేగంగా రాజకీయ సమీకరణలు మారుతున్నాయి. నాగర్‌కర్నూల్ జిల్లాలోనూ హస్తం హవా కొనసాగడంతో నాలుగు నియోజకవర్గాల్లో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు విజయం సాధించారు. దీంతో ఈ ప్రభావం ఆయా మున్సిపాలిటీలపై పడే అవకాశం ఉంది. ఇప్పటికే దీనికి సంబంధించి మున్సిపాలిటీలను హస్తగతం చేసుకునేందుకు నాయకులు సిద్ధమవుతున్నారు. ఇక రాబోయే ఐదేళ్లు కూడా పార్టీ అధికారంలో ఉండటంతో తప్పనిసరి పరిస్థితుల్లో కౌన్సిలర్లు పార్టీ మారే అవకాశం ఉండనుంది.

ఏకపక్ష నిర్ణయాలతోనే చేటు...



నాగర్‌కర్నూల్ మున్సిపాలిటీ

శాసనసభ ఎన్నికల ముందు జిల్లాలో అన్ని నియోజకవర్గాల్లో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఉండడం, చైర్మన్లతో పాటు కౌన్సిలర్లు ఏకపక్ష నిర్ణయాలతో ముందుకెళ్లడంతోనే ఈ వ్యవహారమంతా కొనసాగుతుందనే ప్రచారం జరుగుతుంది. తమ చేతిలో అధికారముందనే కారణంతో జిల్లాలో కొందరు బీఆర్ఎస్ కౌన్సిలర్లు అడ్డగోలుగా అవినీతికి పాల్పడడం, ఇష్టారీతిగా బిల్లులు మంజూరు చేయించుకుంటున్నారని తెలిసిన ఇతర పార్టీలకు చెందిన కౌన్సిలర్లు మాట్లాడలేని పరిస్థితి ఉండేది. ఒక్కసారిగా రాజకీయ సమీకరణలు మారడం, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో అసంతృప్తిగా ఉన్న కౌన్సిలర్లు ఇదే అదునుగా భావించి అవిశ్వాసానికి తెరలేపుతున్నారు.

అచ్చంపేట ఇప్పట్లో లేనట్లే...

అచ్చంపేట మున్సిపాలిటీకి సంబంధించి మొత్తం 20 వార్డుల్లో 13 బీఆర్ఎస్, బీజేపీ 1, మరో 6 వార్డుల్లో కాంగ్రెస్‌కు సంబంధించిన అభ్యర్థులు విజయం సాధించారు. దీనికి సంబంధించిన ఎన్నికలు 2021 ఏప్రిల్‌లో జరగగా.. ఇప్పటి వరకు కేవలం 2 సంవత్సరాల 7 నెలలు మాత్రమే పూర్తి కావడంతో అవిశ్వాసం పెట్టడం కుదరని అంశం. మున్సిపాలిటీలపై అవిశ్వాసానికి సంబంధించి మొదట మూడేళ్లు దాటితే అవిశ్వాసం పెట్టవచ్చని నిబంధన ఉన్నా.. బీఆర్ఎస్ ప్రభుత్వం ఈ నిబంధనను నాలుగేళ్లకు పెంచింది. దీంతో అచ్చంపేటకు అవిశ్వాసం పెట్టే గండం లేనట్లే.

■ కల్వకుర్తిలో మొత్తం 22 వార్డులు ఉండగా.. 2020లో జరిగిన ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు 6, కాంగ్రెస్‌కు 6, బీజేపీ 1, ఇండిపెండెంట్‌గా నలుగురు కౌన్సిలర్లు గెలిచారు. దీంతో ఇండిపెండెంట్‌గా గెలిచిన కౌన్సిలర్ల మద్దతు కూడగట్టుకుని బీఆర్ఎస్ చైర్మన్‌ను ఎన్నుకున్నారు. కాగా ప్రస్తుతం కల్వకుర్తి మున్సిపాలిటీ అవిశ్వాసానికి సంబంధించి పెద్దగా చర్చ జరగడం లేదు.

■ ఇక కొల్లాపూర్‌లో 20 వార్డులకు గాను 9 వార్డులు బీఆర్ఎస్, 11 వార్డులు ఆల్‌ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ తరఫున పోటీ చేసిన అభ్యర్థులు గెలిచారు. అప్పట్లో మాజీ ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డి, ప్రస్తుత ఎమ్మెల్యే జూపల్లి కృష్ణారావు ఒకే పార్టీలో ఉండటంతో హర్షవర్ధన్‌రెడ్డి వర్గం బీఆర్ఎస్ తరఫున, జూపల్లి వర్గం ఆల్‌ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ తరఫున పోటీ చేశారు. చైర్మన్ ఎన్నికల సమయంలో నాగర్‌కర్నూల్ ఎంపీ రాములు, ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్‌రెడ్డి, ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డి తమ ఓటు హక్కును కొల్లాపూర్‌లోనే వినియోగించుకోవడంతో బీఆర్ఎస్‌కు బలం 12కు చేరుకుని చైర్మన్‌ను ఎన్నుకున్నారు. అనంతరం జూపల్లి వర్గానికి చెందిన ఇద్దరు కౌన్సిలర్లు బీఆర్ఎస్‌లో చేరగా.. శాసనసభ ఎన్నికల ముందు ఇద్దరు కౌన్సిలర్లు కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. అయితే ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో అవిశ్వాసం పెట్టే ప్రయత్నాలు జరుగుతున్నాయి. మరో ఇద్దరు బీఆర్ఎస్ కౌన్సిలర్లు కాంగ్రెస్‌లో చేరే అవకాశం ఉన్నట్లు జోరుగా ప్రచారం సాగుతుంది.

ఆ రెండు మున్సిపాలిటీల్లో...

నాగర్‌కర్నూల్ జిల్లాలో నాగర్‌కర్నూల్, కల్వకుర్తి, కొల్లాపూర్, అచ్చంపేట మున్సిపాలిటీలు ఉండగా.. ఇందులో బీఆర్ఎస్ పార్టీకి సంబంధించిన చైర్మన్లు కొనసాగుతున్నారు. 2020 జనవరిలో నాగర్‌కర్నూల్, కొల్లాపూర్, కల్వకుర్తి ఎన్నికలు జరగగా 2021 ఏప్రిల్‌లో అచ్చంపేట మున్సిపాలిటీ ఎన్నికలు జరిగాయి. నాగర్‌కర్నూల్‌లో జరిగిన ఎన్నికల్లో మొత్తం 24 వార్డులకు గాను 14 బీఆర్ఎస్, 9 స్థానాల్లో కాంగ్రెస్ గెలవగా, ఒక అభ్యర్థి ఇండిపెండెంట్‌గా గెలుపొంది బీఆర్ఎస్‌కు మద్దతిచ్చారు. దీంతో బీఆర్ఎస్ పార్టీకి చెందిన వ్యక్తినే మున్సిపల్ చైర్మన్‌గా ఎన్నుకున్నారు. అనంతరం నలుగురు కౌన్సిలర్లు కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్‌కు వెళ్లగా, ఇటీవల ఎన్నికల్లో ఇద్దరు కాంగ్రెస్ కౌన్సిలర్లు బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి వెళ్లారు. కాగా శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్ ఎమ్మెల్యే గెలవగా.. అందరి దృష్టి మున్సిపాలిటీపై పడింది. మున్సిపాలిటీని సైతం కైవసం చేసుకోవాలని కొందరు ఆశావహులు ప్రయత్నాలు కొనసాగిస్తున్నారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు ఎవరెవరు అసంతృప్తితో ఉన్నారో తెలుసుకుని వారి మద్దతు కూడగట్టుకునే ప్రయత్నం చేస్తున్నారు. నాలుగు సంవత్సరాల తరువాతే అవిశ్వాసం పెట్టాలన్న నిబంధన ఉండటం, జనవరి 28న నాలుగు సంవత్సరాలు పూర్తవుతుండటంతో అప్పటి వరకు కౌన్సిలర్లను కూడగట్టుకునే పనిలో ఉన్నారు. ఇప్పటికే అధికార పార్టీ నేతలతో సంప్రదింపులు జరిపినట్లు జోరుగా చర్చ జరుగుతుంది.

మైసమ్మ దేవతను దర్శించుకున్న మంత్రి జూపల్లి

పెద్దకొత్తపల్లి: నాయినోనిపల్లి మైసమ్మ దేవతను రాష్ట్ర ఎక్సైజ్ పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఆదివారం దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. కొల్లాపూర్ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా గెలుపొందడంతో పాటు రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చినందుకు మొక్కులు తీర్చుకుని రాష్ట్రం, నియోజకవర్గ ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని కోరుకున్నారు. నియోజకవర్గంలో సమస్యలు ఉంటే వద్దకు తీసుకురావాలని, సమస్యల పరిష్కారానికి, నియోజకవర్గ అభివృద్ధికి కృషిచేస్తానని అన్నారు. మంత్రి వెంట కాంగ్రెస్ నాయకులు చంద్రయ్య, శ్రీనివాసులు, నాయినోనిపల్లి సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

నేటినుంచి.. బడిబయటి పిల్లల సర్వే



మహమ్మదాబాద్ మండలం కంచన్‌పల్లిలో ఇటుక బట్టీల వద్ద పనిచేసేందుకు వచ్చిన వారి పిల్లల వివరాలు సేకరిస్తున్న సీఆర్పీ(ఫైల్)

క్షేత్రస్థాయిలో పర్యటించనున్న అధికారులు

- 14 ఏళ్లలోపు వారిని గుర్తించనున్న విద్యాశాఖ
- బడికి వెళ్లని వారిని తిరిగి పంపించేందుకు చొరవ
- ఉమ్మడి జిల్లాలో మూడేళ్లుగా సీజనల్ హాస్టల్స్, వర్క్‌సైడ్ స్కూళ్లు ఏర్పాటు చేయని ప్రభుత్వం

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పాఠశాలలకు వెళ్లకుండా.. వివిధ రకాల పనులు చేస్తున్న 14 ఏళ్లలోపు చిన్నారులను గుర్తించేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. ఈ మేరకు సోమవారం నుంచి క్షేత్రస్థాయిలో సర్వే చేపట్టేందుకు విద్యాశాఖ అధికారులు చర్యలు చేపట్టారు. అనంతరం బడికి వెళ్లడం లేదు.. బడికి పంపించేందుకు ఎలాంటి అవకాశాలు ఉన్నాయనే అంశాలపై ఆరా తీయనున్నారు. అయితే గత కొన్నేళ్లుగా ఈ ప్రక్రియ కొనసాగుతున్నప్పటికీ పూర్తిస్థాయిలో అడ్డుకట్ట వేయలేకపోతున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

సర్వే చేసే విధానం ఇలా..

విద్యాహక్కు చట్టం ప్రకారం ప్రతి చిన్నారి చదువుకోవాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం బడి బయటి పిల్లల సర్వే చేపడుతోంది. ఇందులో భాగంగా గత జనవరిలో ఒకసారి చేపట్టగా.. ప్రస్తుతం రెండోసారి సోమవారం నుంచి వచ్చే నెల 10వ తేదీ వరకు వివరాలు సేకరించనున్నారు. ఫీల్డ్‌స్థాయిలో సీఆర్పీలు (క్లస్టర్ రీసోర్స్‌పర్సన్లు) చిన్నారుల వివరాలను రెండు రకాలుగా 6– 14 ఏళ్లలోపు, 15–19 ఏళ్లలోపు వారిని గుర్తించాల్సి ఉంటుంది. ఈ వివరాలను ప్రభుత్వం సూచించిన ఫార్మాట్‌లో సేకరించి జాతీయ స్థాయి ప్రబంధక్ పోర్టల్‌లో నమోదు చేస్తారు.

సీజనల్ హాస్టల్స్ ఏవి?

ఉమ్మడి మహబూబ్‌నగర్‌లో చాలామంది ప్రజలు వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తుంటారు. వ్యవసాయ పనులు పూర్తయ్యాక బతుకుదెరువు కోసం విద్యార్థుల తల్లిదండ్రులు మహారాష్ట్ర, పుణె తదితర ప్రాంతాలకు వలస వెళ్తుంటారు. ఈ క్రమంలో చిన్నారులను సైతం తమ వెంట తీసుకెళ్లడం వల్ల వారి చదువులు మధ్యలోనే ఆగిపోతాయి. ఇందు కోసం వలస వెళ్లే వారి పిల్లలను గుర్తించి స్వచ్ఛంద సంస్థల సహకారంతో సీజనల్ హాస్టల్స్ ఏర్పాటు చేయించి వారికి అన్నిరకాల వసతులు కల్పించి చదువు కొనసాగేలా చూడాలి. కానీ, వీటిని గత మూడేళ్లుగా ప్రభుత్వం ఏర్పాటు చేయడం లేదు. దీంతో వలస వెళ్లిన వారి పిల్లలు చదువులకు దూరమయ్యే పరిస్థితి నెలకొంది. గతంలో ఏర్పాటు చేసిన సీజనల్ హాస్టల్స్ నిర్వాహకులకు బిల్లులు ఇవ్వలేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

పని ప్రదేశాల్లో..

ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి ప్రజలు ఉపాధి కోసం వలస వెళ్తుంటారు. బొగ్గు, ఇటుక బట్టీలు, ప్రాజెక్టుల నిర్మాణాలు చేపట్టేందుకు సమూహంగా వెళ్లే వారి పిల్లలు పాఠశాలకు వెళ్లలేని పరిస్థితి ఉంటే వారి కోసం తాత్కాలికంగా ఒక ఉపాధ్యాయుడిని నియమించి స్కూల్ ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. కానీ, ఉమ్మడి జిల్లాలో గత కొన్నేళ్లుగా వీటిని ఎక్కడా ఏర్పాటు చేసిన దాఖలాలు కనిపించడం లేదు. విద్యార్థులను గుర్తించిన వెంటనే అధికారులు చర్యలు తీసుకొని వర్క్‌సైడ్ స్కూల్స్ ఏర్పాటు చేయాలని విద్యార్థి సంఘాలు కోరుతున్నాయి.

పకడ్బందీగా చేపడతాం..



సోమవారం నుంచి బడిబయటి పిల్లల సర్వే ప్రారంభమవుతుంది. కాంప్లెక్స్‌ల వారీగా సీఆర్పీలు సర్వేలో పాల్గొని పకడ్బందీగా చేపడుతారు. సర్వే అనంతరం బడికి వెళ్లని చిన్నారులను గుర్తించి వారిని స్థానిక పాఠశాలల్లో చేర్పిస్తాం. వారు బడికి వెళ్లలేని పరిస్థితి.. నిర్దేశిత సంఖ్యలో చిన్నారులు ఉంటే వారికి సీజనల్ హాస్టళ్లు ఏర్పాటు చేస్తాం. – రవీందర్, డీఈఓ, మహబూబ్‌నగర్

వసతులు కల్పించాలి..



చిన్నారులకు చదువుకోవాలని ఆసక్తి ఉన్న గ్రామీణ ప్రాంతాల్లో పరిస్థితులు అనుకూలించక చాలామంది చదువులకు దూరమవుతున్నారు. ప్రభుత్వం సర్వే పూర్తయిన వెంటనే వర్క్‌సైడ్ స్కూల్స్, సీజనల్ హాస్టళ్లు ఏర్పాటు చేసి పేద విద్యార్థులకు చదువును మరింత చేరువ చేయాల్సిన అవసరం ఉంది. – శ్రీధర్, ఏబీవీపీ రాష్ట్ర నాయకులు


ప్రతి ఒక్కరు చదువుకునేలా..



14 ఏళ్లలోపు ప్రతి చిన్నారికి ప్రభుత్వం వసతులు కల్పించి చదువుకునే విధంగా చర్యలు తీసుకోవాలి. సర్వే అనంతరం వివిధ ప్రాంతాల నుంచి వలస వచ్చిన వారి పిల్లలకు వర్క్‌సైడ్ స్కూల్స్ ఏర్పాటు చేయాలి. ఉమ్మడి జిల్లా నుంచి వలస వెళ్లిన వారి పిల్లల కోసం సీజనల్ హాస్టల్స్ అందుబాటులోకి తేవాలి. – ప్రశాంత్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి

యాసంగికి నీళ్లేవి..?

- 15 రోజుల కిందటే ప్రభుత్వానికి నివేదిక పంపిన ఇరిగేషన్ శాఖ
- ఈసారి వానాకాలంలోనే వారబందీ పద్ధతిలో సాగునీటి విడుదల
- ప్రస్తుత సీజన్‌లో క్రాప్ హాలీ డే.. ఆందోళనలో రైతన్నలు
- తీవ్రమైన వర్షాభావంతో మారిన పరిస్థితులు



ఆర్డీఎస్ కాల్వలో నిలిచిన నీటి సరఫరా

గద్వాల రూరల్: జూరాల, నెట్టెంపాడు, ఆర్డీఎస్ ప్రాజెక్టుల కింద ఎనిమిదేళ్ల కిందట తలెత్తిన పరిస్థితులే మళ్లీ పునరావృతమయ్యాయి.. దీంతో ప్రస్తుత యాసంగి సీజన్‌లో ఈ ప్రాజెక్టుల కింద ఉన్న ఆయకట్టుకు సాగునీటిని అందించే పరిస్థితి కనిపించడం లేదు.. ఈ ఏడాది వానాకాలంలో తీవ్ర వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో ఖరీఫ్‌లో నానాతంటాలు పడుతూ వారబందీ విధానంతో ఆయకట్టుకు సాగునీరు అందించారు.. ప్రస్తుతం ప్రాజెక్టుల్లో ఉన్న నీటి నిల్వను వివరిస్తూ యాసంగికి సాగునీటిని సరఫరా చేయడం కష్టమని 15 రోజుల కిందటే ప్రభుత్వానికి నివేదిక పంపారు. దీంతో ఆయా ప్రాజెక్టుల కింద క్రాప్ హాలీడే పరిస్థితులు సుస్పష్టంగా కనిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వం నుంచి వచ్చే ఆదేశాల మేరకు అధికారులు త్వరలోనే ప్రాజెక్టుల కింద సాగునీటి సరఫరాపై రైతులకు స్పష్టత ఇవ్వనున్నారు.

35 వేల ఎకరాల్లో..

జూరాల ప్రాజెక్టు కుడి కాల్వ పరిధిలో వానాకాలం సీజన్‌లో మొత్తం 35 వేల ఎకరాల్లో ప్రధానంగా వరితోపాటు వివిధ రకాల పంటలు సాగయ్యాయి. అయితే తీవ్ర వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో అక్టోబర్ నుంచే పంటలకు వారబందీ విధానంతో సాగునీటిని విడుదల చేశారు. మరోవైపు ఆర్డీఎస్ కింద 38 వేల ఎకరాల్లో పంటలు సాగు చేయగా.. ఈ పంటలకు సాగునీటిని అందించేందుకు జూరాల– ఆర్డీఎస్ లింకు కెనాల్ ద్వారా నీటిని విడుదల చేశారు. రెండు ప్రాజెక్టుల కింద సాగునీరు అందించేందుకు ఉన్న నీటినిల్వ ఆధారంగా నీటి పారుదల అధికారులు వారబందీ విధానం అమలు చేశారు. జూరాల కింద ఆయకట్టుకు నాలుగు రోజులు, ఆర్డీఎస్ కింద ఆయకట్టుకు మూడు రోజుల చొప్పున నీటిని విడుదల చేశారు. అలాగే నెట్టెంపాడు ప్రాజెక్టు కింద ఖరీఫ్‌లో 1.11 లక్షల ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగుచేయగా ఇందులో గుడ్డెందొడ్డి రిజర్వాయర్ కింద 6 వేల ఎకరాలు, ర్యాలంపాడు రిజర్వాయర్ కింద 1.05 లక్షల ఎకరాల్లో పంటలు సాగయ్యాయి. ఇక్కడ కూడా అధికారులు వారబందీ విధానంతో పంటలకు సాగునీటిని విడుదల చేశారు.

ప్రాజెక్టుల్లో నీటి నిల్వ ఇలా..

జలాశయం	పూర్తిస్థాయి నీటిమట్టం	ప్రస్తుతం ఉన్నది (టీఎంసీలలో..)
జూరాల	9.567	8.08
గుడ్డెందొడ్డి	1.1	0.8
ర్యాలంపాడు	4.0	0.6

చరిత్రలో తొలిసారిగా..

ఈ ఏడాది వానాకాలంలో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. ఫలితంగా జూరాలకు వరద నీరు పూర్తిగా నిలిచిపోయింది. అలాగే నెట్టెంపాడుకు సైతం నీటి పంపింగ్ అరకొరగానే సాగింది. దీంతో ఆయా ప్రాజెక్టుల్లో నీటి నిల్వను బట్టి అధికారులు నానాతంటాలు పడుతూ ఖరీఫ్‌లో వారబందీ విధానంతో పంటలకు సాగునీటిని విడుదల చేశారు. జూరాల ప్రాజెక్టు చరిత్రలోనే ఆయకట్టుకు అక్టోబర్‌లో వారబందీ విధానం అమలు చేయడం ఇదే తొలిసారి. అలాగే తుంగభద్ర నది పరివాహక ప్రాంతంలోనూ వర్షాలు పడకపోవడం, ఆగస్టు చివరి వరకు కర్ణాటకలోని టీబీడ్యాం నుంచి ఆర్డీఎస్ ప్రాజెక్టుకు నీరు రాకపోవడంతో ఆయకట్టు రైతులు ఆందోళనకు దిగడంతో ప్రభుత్వం జూరాల– ఆర్డీఎస్ లింకు కెనాల్ కింద కూడా వారబందీ విధానం అమలుచేసింది. దీంతో జూరాల ప్రాజెక్టు కింద 0–డిస్ట్రిబ్యూటరీ నుంచి 35– డిస్ట్రిబ్యూటరీ వరకు వాటి కింద సాగైన పంటలకు నాలుగు రోజులపాటు, జూరాల– ఆర్డీఎస్ లింకు కెనాల్ పరిధిలో 36 డిస్ట్రిబ్యూటరీ నుంచి 38 డిస్ట్రిబ్యూటరీ వరకు వాటి కింద సాగైన పంటలకు మూడురోజుల పాటు నీటిని విడుదల చేశారు. ప్రస్తుతం ఈ ప్రాజెక్టుల కింద సాగు చేసిన పంటలు ఇప్పటికే 70 శాతం మేర కోతకు రాగా మరో 15 రోజుల్లో పూర్తిస్థాయిలో రానున్నాయి.

కోయిల్‌సాగర్ కింద క్రాప్ హాలీడే


దేవరకద్ర: కోయిల్‌సాగర్ ఆయకట్టు కింద యాసంగి పంటకు క్రాప్ హాలీడే ప్రకటించారు. వర్షాభావ పరిస్థితుల కారణంగా శ్రీశైలంలో నీటి మట్టం పడిపోవడం వల్ల మిషన్ భగీరథ పథకం ద్వారా తాగునీటి అవసరాల కోసం కోయిల్‌సాగర్ ప్రాజెక్టు నీటిని వినియోగించడానికి యాసంగి పంటలకు నీటి విడుదల నిలిపివేస్తున్నట్లు నీటి పారుదల శాఖ అధికారులు ఇప్పటికే కోయిల్‌సాగర్ ఆయకట్టు రైతులకు సూచించారు. ప్రస్తుతం కోయిల్‌సాగర్‌కు జూరాల ఎత్తిపోతల పథకం ద్వారా నీటి విడుదల చేస్తు వచ్చారు. వర్షాలు సరిగా కురవకపోయినా ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 32.6 అడుగుల వరకు చేరింది. గత వానాకాలంలో సైతం జూరాల నీటిని విడుదల చేస్తూ.. మరోపక్క కాల్వల ద్వారా పంటలకు నీటిని వదిలారు. అయితే గత నవంబర్ చివరి వారంలో నీటి విడుదల నిలిపివేసి కేవలం ప్రాజెక్టును నింపుతూ వచ్చారు.

పంటలు వేసుకోవద్దు..

కోయిల్‌సాగర్ ఆయకట్టు కింది రైతులు యాసంగి పంటలు వేసుకోవద్దు. గత సీజన్ చివరలోనే యాసంగి పంటలు సాగు చేయొద్దని రైతులకు చెప్పాం. ప్రాజెక్టులో ఉన్న నీటిని తాగునీటి అవసరాలకే ఉపయోగించాలని ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఆయకట్టు రైతులు ఈ విషయం గమనించి సహకరించాలి.

– ప్రతాప్‌సింగ్, కేఎస్పీ ఈఈ

ప్రభుత్వానికి నివేదించాం..



జిల్లాలో ఉన్న ప్రాజెక్టులు జూరాల, నెట్టెంపాడు, ఆర్డీఎస్‌లో నీటినిల్వ పూర్తిగా అడుగంటాయి. యాసంగిలో ఆయకట్టుకు నీటిని విడుదల చేయడం కష్టసాధ్యం. ఇదే విషయాన్ని 15 రోజుల కిందట ప్రభుత్వానికి నివేదించాం. ప్రభుత్వం నుంచి వచ్చే ఆదేశాల మేరకు యాసంగిలో నీటి సరఫరాపై అధికారికంగా ప్రకటిస్తాం. – శ్రీనివాస్‌రావు, జిల్లా నీటిపారుదల శాఖ ఎస్ఈ, జోగుళాంబ గద్వాల

హామీలు అమలు చేయాలి

నాగర్‌కర్నూల్ రూరల్: కాంగ్రెస్ పార్టీ తన మానిఫెస్టోలో పెట్టిన హామీలను నెరవేరుస్తూ.. ప్రజాస్వామ్య పాలన అందించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జాన్‌వెస్లీ అన్నారు. ఆదివారం సీపీఎం జిల్లా కమిటీ సమావేశం ఆ పార్టీ కార్యాలయంలో నిర్వహించగా.. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ప్రజలకు సంక్షేమ ఫలాలు అందించాలని, ప్రజాస్వామ్య విలువలను కాపాడాలన్నారు. ప్రజల ఆలోచనకు అనుగుణంగా ప్రభుత్వం నడపాలని, నియంతృత్వ విధానాలవైపు అడుగు వేయవద్దని ఆకాంక్షించారు. తెలంగాణ ఉద్యమకారులపై పెట్టిన కేసులను కాకుండా, ఉద్యమకారులతో పాటు ప్రజా ఉద్యమాల్లో ప్రభుత్వం పెట్టిన అక్రమ కేసులను కూడా ఎత్తివేయాలన్నారు. లౌకిక ప్రజాస్వామ్య, సామ్యవాద ఆలోచనా విధానాల అభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గం పర్వతాలు, ఆర్ శ్రీనివాసులు, దేశ్యానాయక్, ఆంజనేయులు, ఎం. శ్రీనివాసులు, మల్లేష్, శంకర్, శివవర్మ పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఎన్ఎంఎంఎస్ పరీక్ష



పరీక్ష సరళిని పరిశీలిస్తున్న ప్రభుత్వ పరీక్షల నిర్వహణ అధికారి రాజశేఖర్ రావు

కందనూలు: జిల్లా కేంద్రంలో ఆదివారం నిర్వహించిన నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్(ఎన్ఎంఎంఎస్) రాతపరీక్ష ప్రశాంతంగా ముగిసింది. ఉదయం 9:30 నుంచి మధ్యాహ్నం 12:30 వరకు పరీక్ష నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలల్లో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులు ఈ పరీక్ష రాశారు. జిల్లాలో నమోదు చేసుకున్న మొత్తం 649 మందికి గానూ 614 మంది విద్యార్థులు హాజరయ్యారు. 35 మంది గైర్హాజరయ్యారు. ఇందు కోసం జిల్లా కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్, జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల, ప్రభుత్వ హైస్కూల్‌లో పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పరీక్షల నిర్వహణ అధికారి రాజశేఖర్ రావు పరీక్ష కేంద్రాలను తనిఖీ చేసి, సిబ్బందికి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. అనంతరం ఆయన మాట్లాడారు. ఎన్ఎంఎంఎస్ పరీక్షలను పకడ్బందీగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించినట్లు చెప్పారు. ఈ పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వం నుంచి ప్రతి సంవత్సరం రూ.12,000 వరకు ఐదు సంవత్సరాల పాటు ఉన్నత చదువులకు స్కాలర్‌షిప్ అందజేయనున్నట్లు వివరించారు.

క్లుప్తంగా

పాముకాటుతో వ్యక్తి మృతి


చెన్నయ్య (ఫైల్)

హన్వాడ: పాముకాటుకు గురై ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన ఆదివారం ఉదయం మండలంలోని వేపూర్‌లో చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన కొత్త చెన్నయ్య (45) మూడురోజుల కిందట రోజులాగే పొలానికి వెళ్లగా గట్టుపై పాము కాటువేసింది. వెంటనే కుటుంబసభ్యులు నారాయణపేట జిల్లా గుండుమాల్ మండలం కొమ్మూర్‌లోని నాటువైద్యుడికి చూపించారు. మూడురోజులుగా అక్కడే చికిత్స పొందుతుండగా ఆదివారం ఉదయం పరిస్థితి విషమించి మృతిచెందాడు. కొత్త చెన్నయ్యకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

అనుమానాస్పద స్థితిలో మరొకరు..

గద్వాల క్రైం: అనుమానాస్పదంగా వ్యక్తి మృతి చెందిన ఘటన ఆదివారం పట్టణంలోని సుంకులమ్మమెట్టు కాలనీలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ శ్రీకాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. కాలనీకి చెందిన తెలుగు కృష్ణ (48) లారీ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. అయితే దౌదర్‌పల్లి కాలనీకి చెందిన వెంకటలక్ష్మితో 25ఏళ్ల క్రితం వివాహమైంది. ఇరువురి మధ్య కొన్నేళ్ల క్రితమే కుటుంబ సమస్యల కారణంగా భార్య తన పుట్టింటికి వెళ్లిపోయింది. ఈ క్రమంలో ఇంట్లో కృష్ణ ఒంటరిగా ఉంటున్నాడు. శనివారం రాత్రి ఇంట్లోకి వెళ్లి కృష్ణ ఆదివారం ఉదయం 10గంటలైన బయటకు రాకపోవడంతో స్థానికులు కిటికిలో నుంచి చూడగా ఉరేసుకుని ఉన్నట్లు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అనుమానస్పద కేసుగా నమోదు చేసుకుని మృతికి గల కారణాలపై విచారణ చేపట్టినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

మందిపల్లిలో యువకుడు..

మరికల్: పెళ్లి జరిగిన ఆరు నెలలకే అనుమానాస్పద స్థితిలో యువకుడు మృతిచెందిన సంఘటన చోటుచేసుకుంది. అందుకు సంబంధించి ఎస్‌ఐ రమేష్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ధన్వాడ మండలం మందిపల్లికి చెందిన విష్ణువర్ధన్(30)కు ఆరు నెలల కిందట వివాహమైంది. రెండు రోజుల కిందట ఇంటి నుంచి బయలుదేరే ముందు, గొర్రెల వద్దకు వెళ్తున్నానని కుటుంబ సభ్యులకు తెలియజేశాడు. ఆదివారం సొంత పొలం వద్దకు వెళ్లిన తండ్రికి నీటి గుంత గట్టుపై కుమారుడి దుస్తులు, చెప్పులు, ఫోన్ కనిపించింది. ఆయన నీటి గుంతలో పరిశీలించగా.. కుమారుడి మృతదేహం కనిపించింది. ఈ విషయమై పోలీసులకు సమాచారం ఇచ్చాడు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ వివరించారు.

రైలు కిందపడి మహిళ ఆత్మహత్య

మహబూబ్‌నగర్ క్రైం: రైలు కిందపడి గుర్తు తెలియని మహిళ ఆత్మహత్యకు పాల్పడింది. రైల్వే ఎస్‌ఐ సయ్యద్ అక్బర్ తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని బోయపల్లి గేట్ సమీపంలో ఆదివారం రాత్రి గుర్తు తెలియని మహిళ(35) రైలు కిందపడి ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి దగ్గర ఎలాంటి ఆధారాలు లభ్యం కాలేదని, మృతదేహం జిల్లా ఆస్పత్రికి తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

'సాక్షి' స్పెల్-బీ, మ్యాథ్స్-బీకి స్పందన


మౌంట్‌బాసిల్ హైస్కూల్‌లో పరీక్ష రాస్తున్న విద్యార్థులు

SAKSHI SPELL Bee 2023-24

SAKSHI MATH BEE 2023-24

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: జిల్లాకేంద్రానికి సమీపంలోని మౌంట్ బాసిల్ హైస్కూల్ (ఎంబీహెచ్‌ఎస్)లో ఆదివారం 'సాక్షి' ఆధ్వర్యంలో నిర్వహించిన స్పెల్-బీ (సెమీ ఫైనల్ రౌండ్), మ్యాథ్స్-బీ సెకండ్ రౌండ్)కి విశేష స్పందన వచ్చింది. కేటగిరీ- 1, 2, 3, 4లో కొనసాగిన ఈ పరీక్షలకు మొత్తం 60 మంది విద్యార్థులు హాజరయ్యారు. కాగా, వీటికి ప్రజెంటింగ్ స్పాన్సర్‌గా డ్యూక్స్ వ్యాపి, అసోసియేట్ స్పాన్సర్‌గా ట్రిప్స్ ఇంటర్నేషనల్ స్కూల్ వ్యవహరించాయి. ఈ సందర్భంగా ఎంబీహెచ్‌ఎస్ డైరెక్టర్ పూజితామోహన్‌రెడ్డి మాట్లాడుతూ 'సాక్షి' ఆధ్వర్యంలో తమ పాఠశాలలో నిర్వహించడం ఎంతో గర్వంగా ఉందన్నారు. ఇలాంటి పోటీ పరీక్షలు విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు చంద్రకళా వెంకట్, కృష్ణసుశాంత్, శిరీష ప్రవీణ్, ప్రిన్సిపాల్ సురేష్‌రెడ్డి, కో-ఆర్డినేటర్ సాయిప్రణీత తదితరులు పాల్గొన్నారు.

కొత్త పదాలు తెలుసుకున్నా..



'సాక్షి' ఆధ్వర్యంలో నిర్వహించిన స్పెల్-బీ (కేటగిరీ-2) ద్వారా ఇంగ్లిష్‌లో ఎన్నో కొత్త పదాలు తెలుసుకోగలిగాను. ముఖ్యంగా ఈ భాషలో ఓవెల్ సౌండ్స్, పదజాలం ఎలా వాడాలో నేర్చుకున్నాను. ఆయా పదాలను ఎప్పుడు ఉపయోగించాలి.. వాక్య ప్రయోగం ఎలా.. అనేది నాకు బాగా అర్థమైంది.

– విహాస్‌తేజ, నాలుగో తరగతి

సంతోషంగా ఉంది



'సాక్షి' ఆధ్వర్యంలో మ్యాథ్స్-బీ (కేటగిరీ-1) రాయడం ఎంతో సంతోషంగా ఉంది. ఈ పరీక్షలో వచ్చిన అన్ని ప్రశ్నలు పూర్తి చేయగలిగాను. ముఖ్యంగా సబ్‌స్ట్రాక్షన్, ప్యాటర్న్‌లో సులువైన పద్ధతులు తెలుసుకున్నాను. లెక్కల సబ్జెక్టులో ఉపాధ్యాయులు బాగానే బోధిస్తున్నారు. చాలా చక్కగా, సులువుగా అర్థమవుతోంది.

– అరుష్‌రాజ్, రెండో తరగతి

ఫార్ములా చేయడం సులువు



గణితం నాకు ఇష్టమైన సబ్జెక్టు. మ్యాథ్స్-బీ (కేటగిరీ-3) పరీక్ష వల్ల కొన్ని ఫార్ములాలు చేయడం ఎంతో సులువైంది. నెక్ట్స్ ఎగ్జామ్‌కు ఎంతగానో ఉపయోగపడుతుందని అనుకుంటున్నా. 'సాక్షి' ఆధ్వర్యంలో ఈ పరీక్ష రాయడం సంతోషంగా ఉంది. ముఖ్యంగా తక్కువ సమయంలో ఎక్కువ ప్రశ్నలకు జవాబు చేయగలిగాను.

– హిమనయన, ఆరోతరగతి

ఐఐటీకి ఉపయోగం



నేను ఇప్పటి నుంచే ఐఐటీకి ప్రిపేర్ అవుతున్నాను. 'సాక్షి' ఆధ్వర్యంలో నిర్వహించిన మ్యాథ్స్-బీ (కేటగిరీ-4) రాయడం వల్ల ఐఐటీకి ఎంతగానో ఉపయోగపడుతుందని భావిస్తున్నాను. ప్రధానంగా కొన్ని కఠినమైన ప్రాబ్లమ్స్‌ను ఎంతో ఈజీగా నేర్చుకోగలిగాను. పేపర్ కష్టంగానే ఉన్నా బాగా చేయగలిగాను.

– రాంచరణ్, తొమ్మిదో తరగతి

మా సహకారం ఉంటుంది



'సాక్షి' ఆధ్వర్యంలో మా పాఠశాలలో ప్రతిఏటా స్పెల్-బీ, మ్యాథ్స్-బీ పరీక్షలు నిర్వహించడం ఎంతో సంతోషంగా ఉంది. యాజమాన్యం తరఫున మా సహకారం ఎల్లప్పుడూ ఉంటుంది. ఇలాంటి పోటీ పరీక్షలతో విద్యార్థుల్లో పోటీతత్వంతోపాటు సృజనాత్మకత ఎంతగానో పెరుగుతుంది.

– సురేష్‌రెడ్డి, ప్రిన్సిపాల్, ఎంబీహెచ్‌ఎస్

విద్యార్థులకు మేలు..



'సాక్షి' ఆధ్వర్యంలో ఏటా నిర్వహిస్తున్న స్పెల్-బీ, మ్యాథ్స్-బీ పరీక్షలు విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి. వారు ఆయా సబ్జెక్టుల్లో బాగా రాణించేందుకు దోహదపడుతున్నాయి. ముఖ్యంగా తమ నైపుణ్యాన్ని మెరుగుపరుచుకుంటున్నారు. భవిష్యత్‌లో ఇలాంటి పోటీలు పరీక్షలు రాయడం వారికి సులువవుతుంది.

– సాయిప్రణీత, ఈవెంట్ కోఆర్డినేటర్

ఆర్టీసీ బస్టాండ్ల కిటకిట

- ఉచిత ప్రయాణానికి మహిళల తాకిడి


మహబూబ్‌నగర్ బస్టాండ్‌లో బస్సు ఎక్కుతున్న మహిళలు

స్టేషన్ మహబూబ్‌నగర్: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాలక్ష్మి పథకం ఆర్టీసీ బస్సుల్లో మహిళల ఉచిత ప్రయాణ సౌకర్యానికి విశేష స్పందన లభిస్తుంది. మొదటి శనివారం మధ్యాహ్నం 2 గంటల నుంచి మహిళలకు పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించడానికి అవకాశం కల్పించగా.. ఆదివారం కూడా ఆర్టీసీ బస్టాండ్లు మహిళలతో కిటకిటలాడాయి. ఉమ్మడి జిల్లాలోని ఆయా బస్టాండ్లలో పలువురు ఎమ్మెల్యేలు మహాలక్ష్మి పథకం ఆర్టీసీ బస్సులను ప్రారంభించారు. బస్సులన్నీ ఎక్కువ సంఖ్యలో మహిళలతో రాకపోకలు సాగించాయి. ముఖ్యంగా హైదరాబాద్ రూట్లోని ఎక్స్‌ప్రెస్ బస్సులు ఇటు మహిళలు, అటు ప్రయాణికులతో రద్దీగా కనిపించాయి. ఆర్టీసీ బస్సుల్లో రాష్ట్రవ్యాప్తంగా ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించడంపై మహిళలు సంతోషం వ్యక్తం చేశారు. ఈ సౌకర్యం కల్పించిన కాంగ్రెస్ ప్రభుత్వానికి కృతజ్ఞతలు చెబుతున్నారు.

రీజియన్ పరిధిలో..

మహబూబ్‌నగర్ రీజియన్‌లోని పది డిపోల నుంచి మొదటి రోజు శనివారం 75,940 మంది మహిళలు ప్రయాణించారు. రీజియన్‌లోని షాద్‌నగర్ డిపో పరిధిలో అధిక సంఖ్యలో 12,490 మంది మహిళలు రాకపోకలు సాగించారు. అయితే సాధారణ రోజుల్లో రీజియన్‌కు రూ.1.30 కోట్ల ఆదాయం రాగా ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణంతో రోజుకు రూ.45- 50 లక్షల వరకు ఆదాయం తగ్గే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణానికి మహిళల నుంచి విశేష స్పందన లభిస్తున్నట్లు రీజినల్ మేనేజర్ శ్రీదేవి తెలిపారు.

డిపోల వారీగా మొదటిరోజు ప్రయాణించిన మహిళలు..

డిపో	ప్రయాణికులు
షాద్‌నగర్	12,490
మహబూబ్‌నగర్	11,050
వనపర్తి	8,770
నాగర్‌కర్నూల్	7,990
నారాయణపేట	7,890
గద్వాల	7,845
కల్వకుర్తి	6,951
అచ్చంపేట	6,164
కొల్లాపూర్	6,010
కోస్గి	780



వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో నలుగురి దుర్మరణం

ఉమ్మడి జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో చోటుచేసుకున్న రోడ్డు ప్రమాదాల్లో నలుగురు దుర్మరణం పాలయ్యారు. ఆయా ఘటనలకు సంబంధించి వివరాలిలా..



లింగాల: మండల కేంద్రానికి సమీపంలో అంబట్‌పల్లి వెళ్లే మార్గంలో ఆదివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో అవుసలికుంటకు చెందిన వడ్ల మధు(38) మృతిచెందాడు. మృతుడు లింగాల నుంచి స్వగ్రామానికి ద్విచక్ర వాహనంపై వెళ్తున్న సమయంలో రోడ్డుపై వెళ్తున్న ఎద్దులు తాకి కిందపడగా తలకు బలమైన గాయమై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతునికి భార్య అరుణ, ఇద్దరు పిల్లలు ఉన్నారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు.

జాతీయ రహదారి దాటుతుండగా..

మిడ్జిల్: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతిచెందిన సంఘటన మండల కేంద్రంలో చోటుచేసుకుంది. మిడ్జిల్‌కు, చెందిన మదునల్ల నర్సింహులు(53) ఆదివారం 167 జాతీయ రహదారి దాటుతుండగా.. లారీ వచ్చి ఢీకొట్టింది. దీంతో అతడికి తీవ్ర గాయాలు కాగా.. చికిత్స నిమిత్తం హైదరాబాద్ ఆస్పత్రికి తరలించారు. కాగా అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఈ విషయమై మృతుడి కుమార్తె రమాదేవి ఫిర్యాదు మేరకు లారీ డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలియజేశారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని..

ఉండవెల్లి: మండలంలోని బొంకూరు శివారులో గుర్తుతెలియని వాహనం ఢీకొని బైక్‌పై వెళ్తున్న వ్యక్తి మృతిచెందినట్లు ఎస్‌ఐ బాల్‌రాజు తెలిపారు. ఎస్‌ఐ ఆదివారం తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. వడ్డేపల్లి మండలం రామాపురానికి చెందిన శేఖర్(58) బైక్‌పై కర్నూల్‌కు బయలుదేరుతున్నాడు. ఈ క్రమంలో బొంకూరు పెట్రోల్ బంక్ సమీప మార్గంలోని శివారులో, అలంపూర్ చౌరస్తా నుంచి వస్తున్న గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. దీంతో అతని తలకు తీవ్ర గాయాలై మృతిచెందినట్లు తెలియజేశారు. ఇప్పటి వరకు ఎలాంటి ఫిర్యాదు అందకపోవడంతో కేసు నమోదు చేయలేదని పేర్కొన్నారు.

జల్లాపూర్ శివారులో..

మానవపాడు: మండలంలోని జల్లాపూర్ శివారులో జాతీయ రహదారిపై గుర్తుతెలియని వ్యక్తిని వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందాడని హెడ్‌కానిస్టేబుల్ తిప్పన్న తెలిపారు. శనివారం అర్ధరాత్రి రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తుండగా హైదరాబాద్ నుంచి కర్నూలు వైపు వెళ్తున్న వాహనం ఢీకొట్టిందన్నారు. ఈ మేరకు మృతదేహన్ని అలంపూర్ ఆరోగ్య కేంద్రానికి తరలించామన్నారు. మృతి చెందిన వ్యక్తి శరీరంపై నీలిరంగు చొక్కా, అడ్డపంచ ధరించాడని చెప్పారు. ఈ ఘటనపై కేసు నమోద చేసి దర్యాప్తు చేస్తున్నామని హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు.

ఆటో, కారు ఢీ: ఆరుగురికి గాయాలు

వెల్దండ: మండలంలోని రాఘాయపల్లి గేట్ వద్ద ఆదివారం ఆటో- కారు ఢీకొన్న సంఘటనలో ఆరుగురికి తీవ్ర గాయాలయ్యాయి. పూర్తి వివరాలిలా.. కోడేరు మండలం నాగుళ్లపల్లితండాకు చెందిన నర్సింహ, బాషు, బిక్నీ, మరో ముగ్గురు పిల్లలతో కలిసి ఆటోలో హైదరాబాద్ వెళ్తున్నారు. మార్గమధ్యలో రాఘయపల్లి సమీపంలో వెనక నుంచి వచ్చిన కారు ఆటోను ఢీకొట్టింది. ప్రమాదంలో నర్సింహ, బాషు, బిక్నీ తీవ్రంగా గాయపడగా.. ముగ్గురు చిన్నారులకు స్వల్ప గాయాలయ్యాయి. ప్రమాదానికి కారణమైన కారు ఆపకుండా వెళ్లిపోయాడు. గమనించిన గ్రామస్తులు క్షతగాత్రులను 108 అంబులెన్స్‌లో కల్వకుర్తి ప్రభుత్వ ఆస్పత్రికి, అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించారు. ఈ ఘటనపై ఎలాంటి కేసు నమోదు కాలేదని పోలీసులు చెప్పారు.

షూటింగ్ బాల్ పోటీల్లో ఉమ్మడి జిల్లా ప్రతిభ



మహబూబ్‌నగర్ క్రీడలు: నల్లగొండ జిల్లా చెర్లపల్లిలో ఆదివారం ముగిసిన అండర్-19 షూటింగ్ బాల్ రాష్ట్రస్థాయి పోటీల్లో ఉమ్మడి జిల్లా బాలుర జట్టు మెరుగైన ప్రతిభకనబరిచింది. ఈ పోటీల్లో బాలుర జట్టు మూడో స్థానంలో నిలిచింది.

మద్యం తాగేందుకు వెళ్లి షాక్‌తో వ్యక్తి మృతి


ఘటనా స్థలం వద్ద విచారిస్తున్న పోలీసులు

అమరచింత: మద్యం తాగేందుకు వైన్‌షాప్‌కు వెళ్లిన తిరుమల శేఖర్ (46) కరెంట్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందిన ఘటన పట్టణంలో ఆదివారం వెలుగుచూసింది. పట్టణంలోని బీసీ కాలనీలో తిరుమల శేఖర్ భార్య పద్మతో కలిసి ఉంటున్నాడు. చేనేత వృత్తిపై ఆధారపడి మగ్గం పై జరీ చీరలు తయారు చేస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. శనివారం రాత్రి మందు కోసం వైన్ షాప్‌కు వెళ్లిన శేఖర్ అక్కడే ఉన్న చికెన్‌ఫ్రై షాప్ వద్ద ఇనుప పైప్‌ను పట్టుకోవడం, దానికి కరెంట్ పాస్ అవ్వడంతో అక్కడికక్కడే షాక్‌కు గురయ్యాడు. రాత్రి వేళ వైన్ షాప్ సిబ్బందితో పాటు చికెన్ ఫ్రై చేస్తున్న వ్యక్తులు గమనించకుండా వెళ్లిపోయారు. తిరిగి ఉదయం చికెన్ ఫ్రై షాప్‌ను తెరవడానికి వచ్చిన వారికి శేఖర్ అనుమానస్పదంగా పడి ఉండటం గమనించి పోలీసులకు సమాచారం అందించారు. ఎస్‌ఐ జగన్‌మోహన్ చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆత్మకూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి భార్య పద్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ప్రాణం ఖరీదు రూ.1.50లక్షలు

శేఖర్ మృతి చెందడంతో పట్టణానికి చెందిన పలువురు వైన్‌షాప్ యజమానితో ప్రైవేట్ పంచాయితీ నిర్వహించారు. ప్రాణం పోవడానికి వైన్‌షాప్ యజమాని బాధ్యత వహించి మృతుడి కుటుంబానికి నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. దీంతో యజమాని రూ.1.50లక్షలు మృతుడి కుటుంబానికి ఇస్తామని హామీ ఇచ్చారు.

చికిత్స పొందుతూ యువకుడు మృతి

ఉండవెల్లి: చికిత్స పొందుతూ యువకుడు మృతి చెందిన ఘటన మండలంలోని తక్కశీలలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన బోయ లోకేష్‌కు (22) భీమేశ్వరమ్మతో వివాహమైంది. కాగా పంటలు అమ్మగా వచ్చిన డబ్బులను వృథాగా ఖర్చు చేస్తున్నావంటూ తల్లిదండ్రులు బోయ ఈరన్న, బోయ బీసమ్మలు తరుచుగా మందలించడంతో 8వ తేదీన ప్రాగటూరుకు వెళ్లి ఓ పొలంలో పురుగు మందు తాగాడు. గమనించిన అల్లుడు పరశురాముడు ఆయనను వెంటనే కర్నూల్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. తండ్రి ఈరన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

హోరాహోరీగా అండర్- 17 ఫుట్‌బాల్


ఎమ్మెల్యేతో జ్ఞాపిక అందుకుంటున్న ఫుట్‌బాల్ టోర్నీ విజేత మహబూబ్‌నగర్ జట్టు

- రాష్ట్ర విజేతగా ఉమ్మడి మహబూబ్‌నగర్ జట్టు
- బాలికల విజేతగా రంగారెడ్డి
- బహుమతులు అందజేసిన జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి

జడ్చర్ల టౌన్: ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో మూడు రోజులుగా బాదేపల్లి జెడ్పీహైస్కూల్‌లో నిర్వహిస్తున్న అండర్- 17 ఫుట్‌బాల్ బాలుర విజేతగా ఉమ్మడి మహబూబ్‌నగర్ జట్టు నిలవగా.. రన్నరప్‌గా హైదరాబాద్ జట్టు నిలిచింది. ఆదివారం ముగిసిన టోర్నీలో బాలికల జట్టు విజేతగా రంగారెడ్డి, రన్నరప్‌గా నిజామాబాద్ జట్లు నిలిచాయి. హోరాహోరీగా సాగిన టోర్నీలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జట్టు క్రీడాకారులు ప్రతిభ కనబర్చి 1-0 తేడాతో గెలుపొందారు. బాలికల జట్టు రంగారెడ్డి సైతం 1-0 తేడాతో నిజామాబాద్‌పై విజయం సాధించింది. గెలుపొందిన జట్లకు స్థానిక ఎమ్మెల్యే అనిరుద్‌రెడ్డి షీల్డులు, మెడల్స్ అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జనంపల్లి అనిరుద్‌రెడ్డి క్రీడాకారులను అభినందించారు. రాష్ట్ర విజేతగా నిలిచిన మహబూబ్‌నగర్ జట్టును ప్రత్యేకంగా ప్రశంసించారు. రాష్ట్ర జట్టుకు ఎంపికైన క్రీడాకారులు జాతీయస్థాయిలో రాణించి రాష్ట్రానికి పేరు తీసుకురావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ కార్యదర్శి రమేష్, టోర్నీ నిర్వాహకులు మోయిన్, తెలంగాణ పీఈటీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు విలియం, కార్యదర్శి కిట్టు, ప్రధానోపాధ్యాయులు చంద్రకళ, పీడీ శారదభాయి, వడెన్న, రాజవర్ధన్‌రెడ్డి, పీఈటీలు బాల్‌రాజ్, ఉమాదేవి, ఆనంద్, జ్యోతి, నాగమణి, వెంకటమ్మ, అంపైర్లు భానుకిరణ్, రాము, నరేష్, నికేష్, రాజు, దినేష్ పాల్గొన్నారు.


బాలికల విజేత జట్టు రంగారెడ్డి

ఎలుకల బెడద నివారించుకోండి

పాడి-పంట

అధికారి సలహా: సక్రియనాయక్, ఏడీఏ, అలంపూర్


వరి పంటలో ఎలుకల సంచారం

అలంపూర్: ప్రస్తుతం వరి పంట పొట్ట దశకు చేరుకోవడంతో పంట పొలాల్లో ఎలుకల ఉధృతి పెరుగుతుంది. ఎలుకల బెడద నుంచి పంటను కాపాడుకోకపోతే తీవ్ర నష్టాలను చవి చూడాల్సి వస్తోందని ఏడీఏ సక్రియనాయక్ రైతులకు సూచించారు. ఎలుక జీవన విధానం, వాటి దినచర్య, వాటి నిర్మూలన అంశాలను ఏడీఏ వివరించారు.

జీవిత వృత్తం

జంతు ప్రపంచంలో రెండో తెలివైన జీవి ఎలుక. మనుషుల్లో 30 ఏళ్లకు రాని జ్ఞాన దంతాలు ఎలుకల్లో 30 రోజుల్లో రావడం గమనార్హం. అందుకే ఎలుకకు తెలివితేటలు అపారం. ఎలుక దవడల్లోని దంతాలు రోజుకు 0.3 మి.మీ. చొప్పున పెరుగుతాయి. నిత్యం ఇలా పెరుగుతూ పోతే అవి కపాలాన్ని చీల్చుకుని పోయి ఎలుక మరణిస్తుంది. కనుక దంతాలను అరగదీసుకొనే పనిలో భాగంగా ప్రతి వస్తువును కోరుకుతుంది.

- ఎలుక ఆయుష్ ప్రమాణం 12 నుంచి 18 నెలలు
- యుక్త వయస్సు 2 నుంచి 3 మాసాలకే తరించుకుంటుంది.
- గర్భధారణ కాలం 28 నుంచి 30 రోజులు
- ఈతకు 5 నుంచి 21 పిల్లల చొప్పున 4 లేక 5 కాన్పులు ఉంటాయి.
- ఒక కాన్పులో ఆరు పిల్లల్ని జన్మనిస్తే లింగ నిష్పత్తి 1:1గా ఉంటుంది.
- ఎలుక తన జనాభా తగ్గిపోతుందని భావిస్తే అసాధారణ పిండోత్పత్తి విధానంలో అధిక సంతతిని పెంపొందిస్తాయి.
- ఎలుక నిమిషానికి 8 నుంచి 10 మీటర్ల చొప్పున ఈదగలవు.
- ఆహార పానీయాలు లేకుండా మూడు రోజుల వరకు ఉండగలవు.
- ఎలుక ఏడాదిలో 10 కిలోల ధాన్యాన్ని తినడమేకాక వంద కిలోల ధాన్యాన్ని కలుషితం చేసి పాడు చేస్తాయి.
- ఎలుకల వలన మనుషులకు 14 రకాల వ్యాధులు వస్తాయని శాస్త్రవేత్తలు చెబుతున్నారు.

శోధన ప్రవర్తన..

ఎలుకలు కిలోమీటరు దూరం వరకు పరిసరాలను పరిశోధించడానికి సంచరిస్తుంటాయి. అవి సంచరించే మార్గంలో పంటలేని ప్రదేశంలో సైతం ఎరలు వేసి నివారించుకోవచ్చును.

నూతన స్థావర బీడియం

వస్తువుల స్థానాలు మార్చితే ఎలుకలు వాటి జోలికిపోవు. అందుకే ఇంటిలో వస్తువులను వాటి స్థానాలు మార్చుతుంటే ఎలుకలు దరి చేరవు.

విషపు ఎర తయారీ

వంద గ్రాముల విషపు ఎర తయారీకి 96 గ్రాముల నూకలు +2 గ్రాముల నూనె + 2 గ్రాముల మందుతో విషపు ఎర తయారువుతుంది. దీనిని సామూహిక ఉద్యమ స్ఫూర్తితో చేపడితేనే ఎలుకల నివారణ సమగ్రంగా చేయగలం.

- మొదటి రోజు ఎలుకల కన్నాలను మూసేయాలి.
- రెండో రోజు తెరచుకున్న కన్నాల్లో విషం కలపని ఎరను వేయాలి
- మూడో రోజు విషపు ఎరను చిన్న చిన్న పొట్లాలుగా చేసి కన్నాల్లో వేయాలి

ఆత్రుత ఎక్కువ..

ఎలుకలకు ఆత్రుత ఎక్కువ. విషపు ఎరను పొట్లం కట్టి పెట్టినప్పుడు అవి ఆత్రుత కొద్ది వాటిని కొరికి తింటాయి. అవి అధిక ఆహారాన్ని జీర్ణించుకోలేవు. అలాగని వాంతు చేసుకోవు.

సేద్య పద్ధతులు

పొలాన్ని వేసవిలో దమ్ము సమయంలో గట్లను చెక్కి వాటి పరిమాణం తగ్గించడం, ఎలుక కన్నాలను మట్టితో పూడ్చడం, గట్ల పక్కన గడ్డిని పైరుని సకాలంలో తొలగించడం, వీలైనంతగా ఒకే సారి నాట్లు వేసుకోవడం వలన ఎలుకల బొరియలు తగ్గడమేకాక నిల్వ నీడ లేక ఆహారం దొరక్క వాటిని వెతుకుతూ దూర ప్రాంతాలకు వలస వెళ్తాయి.

యాంత్రిక..

పొలంలో బోనులు, బుట్టలు, పొగ పెట్టడం, ఎలుక కన్నాలను గుర్తించి పట్టడం వంటి యాంత్రిక పద్ధతులు సమయానుకూలంగా వినియోగించుకోవాలి.

రసాయనిక..

ఎలుకల నివారణకు ముఖ్యంగా మూడు రకాల రసాయనిక పదార్థాలు వాడుకలో ఉన్నాయి. జింకు ఫాస్ఫైడ్, బ్రోమోడయోలిన్, అల్యూమినియం ఫాస్ఫైడ్, జింకు ఫాస్ఫైడ్ ఎర పంట కాలంలో ఒక సారి మాత్రమే వాడాలి. బ్రోమోడైలిన్ మందు రక్తం గడ్డకట్టకుండా చేస్తుంది. దీనివల్ల మూడు రోజుల్లో అధిక రక్తస్రావానికి దారి తీసి పక్షవాతం లేక మరణ సంభవిస్తుంది.

దిన చర్య

ఉదయం నాలుగు నుంచి ఏడు గంటలు, సాయంత్రం ఆరు గంటల నుంచి రాత్రి 10 గంటల మధ్య మాత్రమే ఆహార వేటకు బొరియలు వీడి బయటికి వస్తాయి. ఇది గమనించి విషపు ఎర సాయం వేళల్లో అల్యూమినియం ఫాస్ఫైడ్ బిళ్లలు ఉదయం సమయంలో వినియోగించాలి.

సమూలంగా అరికట్టాలి

ఎలుకలు గోడ లేదా గట్టు మూలాలను ఆసరాగా చేసుకుని రాకపోకలు సాగిస్తుంటాయి. ఈ ప్రవర్తనకు అనుగుణంగా గోడ లేదా గట్ల మూల వంపుల్లో బోనులు/ఎరలను ఏర్పాటు చేసుకుని నివారించవచ్చు.

క్లుప్తంగా...



4,141 అడుగుల ఎత్తులో నీళ్లు!

బి.కొత్తకోట: సముద్రమట్టానికి 4,141 అడుగుల ఎత్తులో బ్రిటిష్ పాలనలో అన్నమయ్య జిల్లా బి.కొత్తకోట మండలంలోని పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్‌పై నిర్మించిన బావిలో ఇటీవల కురిసిన వర్షాలకు ఊటనీళ్లు ఉబికి వస్తున్నాయి. దీంతో బావి నిండి..పైకి నీళ్లు వస్తున్నాయి. ఈ దృశ్యాన్ని సందర్శకులు విశేషంగా తిలకిస్తున్నారు. 144 ఏళ్ల క్రితం హార్సిలీకొండలో నీటికోసం అప్పటి ఉమ్మడి చిత్తూరు, కడప జిల్లాల కలెక్టర్ డబ్ల్యూ.డి.హార్సిలీ నిర్మించిన బావి నేటికీ చెక్కు చెదరలేదు. పటిష్టమైన రాతికట్టడంతో నిర్మించిన ఈ బావి ప్రస్తుతం పర్యాటక ప్రదేశంగా మారింది.

శాస్త్రీయ సంగీతంతో మనో వికాసం

కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్



విజయవాడ కల్చరల్: శాస్త్రీయ సంగీతం నిరంతరం ప్రవహించే గంగా ప్రవాహం వంటిదని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు. కేంద్ర సంగీత నాటక అకాడమీ, ఏపీ పర్యాటక శాఖ, కేంద్ర సాంస్కృతిక వ్యవహారాల శాఖ, కేంద్ర టెక్స్‌టైల్ శాఖ ఆధ్వర్యంలో 3 రోజులపాటు నిర్వహించే కృష్ణవేణి సంగీత నీరాజనం కార్యక్రమాన్ని విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఆదివారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ..రాష్ట్ర ప్రభుత్వం సంగీత సాహిత్యాలకు పెద్దపీట వేస్తోందని అభినందించారు. శాస్త్రీయ సంగీతం వల్ల మనో వికాసం కలుగుతుందని చెప్పారు. రాష్ట్ర పర్యాటక శాఖా మంత్రి రోజా మాట్లాడుతూ..భారతీయ సంగీత సంప్రదాయాలు విశిష్టమైనవన్నారు. తెలుగు రాష్ట్రాల పునర్విభజన జరిగాక ఏపీలో తొలిసారిగా కేంద్రం సహకారంతో విజయవాడలో 3 రోజులపాటు కృష్ణవేణి సంగీత నీరాజనం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు.

ఏపీ బాటలో కేంద్రం

- రోడ్డు ప్రమాద బాధితులకు నగదు రహిత వైద్యం
- కేంద్ర రోడ్డు రవాణా శాఖ నిర్ణయం



సాక్షి, అమరావతి: రోడ్డు ప్రమాదాల్లో చోటుచేసుకుంటున్న మరణాల సంఖ్యను తగ్గించేందుకు ఏపీ ప్రభుత్వం అమలు చేస్తున్న విధానాన్ని దేశమంతటా ప్రవేశపెట్టాలని కేంద్ర ప్రభుత్వం సూత్రప్రాయంగా నిర్ణయించింది. రోడ్డు ప్రమాద బాధితులకు నగదు రహిత విధానాన్ని ప్రవేశపెట్టేందుకు సిద్ధమైంది. దీనిపై విధి విధానాలు రూపొందించాల్సిందిగా కేంద్ర రోడ్డు రవాణా శాఖను కేంద్ర ప్రభుత్వం ఆదేశించడం ప్రాధాన్యత సంతరించుకుంది. జాతీయ నేర గణాంకాల సంస్థ(ఎన్‌సీఆర్‌బీ) తాజా నివేదిక ప్రకారం గత ఏడాది దేశవ్యాప్తంగా 4,46,768 రోడ్డు ప్రమాదాలు సంభవించాయి. వాటిలో 4,23,158 మంది గాయపడగా.. 1,71,100 మంది మరణించారు. వారిలో గోల్డెన్ అవర్‌లో మెరుగైన చికిత్స అందకపోవడంతో దాదాపు 50వేల మంది మరణించినట్టు అంచనా. రోడ్డు ప్రమాద బాధితులకు మెరుగైన చికిత్స అందించే దిశగా పోలీస్, రవాణా, ఆర్ అండ్ బీ, వైద్య–ఆరోగ్య శాఖలను సమన్వయపరుస్తూ రాష్ట్ర, జిల్లా స్థాయిలో కమిటీలు ఏర్పాటు చేశారు. దాంతోపాటు రోడ్డు ప్రమాద బాధితులను వెంటనే ఆస్పత్రికి తరలించే సామాన్యులను ప్రోత్సహించేందుకు 'గుడ్ సమరిటన్' విధానంలో నగదు ప్రోత్సాహకాలు అందిస్తోంది. అయినప్పటికీ ఆశించిన ఫలితాలు లేకపోవడంతో ఇతర విధానాలపై కేంద్ర రవాణా శాఖ దృష్టి సారించింది. ఈ నేపథ్యంలోనే ఆంధ్రప్రదేశ్‌తోపాటు దేశంలో ఆరు రాష్ట్రాలు అమలు చేస్తున్న నగదు రహిత వైద్య విధానంపై కేంద్ర ప్రభుత్వం దృష్టి సారించింది. రోడ్డు ప్రమాద బాధితులకు దేశవ్యాప్తంగా నగదు రహిత వైద్య విధానాన్ని అమలు చేయాలని నిర్ణయించింది. గోల్డెన్ అవర్‌గా పరిగణించే రోడ్డు ప్రమాదం సంభవించిన తరువాత తొలి గంటలో అత్యవసర చికిత్సతోపాటు అన్నిరకాల ట్రామా కేర్, ఇతర వైద్య సేవలను పూర్తిగా నగదు రహిత చికిత్స అందిస్తారు. ప్రమాద స్థలానికి సమీపంలోని ప్రైవేట్, కార్పొరేట్ ఆస్పత్రుల్లో తప్పనిసరిగా నగదు రహిత వైద్యం అందించే దిశగా విధి విధానాలను రూపొందించనుంది. నగదు రహిత విధానంపై నివేదిక ఇవ్వాలని ఏపీ రవాణా శాఖతోపాటు ఆయా రాష్ట్రాలను కూడా కోరింది. దీనిపై రెండు నెలల్లో నివేదిక సమర్పించిన తరువాత దేశవ్యాప్తంగా రోడ్డు ప్రమాద బాధితులకు నగదు రహిత వైద్యసేవల విధానాన్ని అమలులోకి తీసుకురావాలని భావిస్తోంది.

వచ్చే ఎన్నికల్లో టీడీపీ, జనసేన అడ్రస్ గల్లంతు

- టీడీపీతో పొత్తు వల్లే తెలంగాణలో కాంగ్రెస్‌కు ఆంధ్రా సెటిలర్స్ దూరం
- ఏపీ ఎన్నికల్లోనూ ఇదే పరిస్థితి పునరావృతం: బాలినేని



ఒంగోలు: వచ్చే ఎన్నికల్లో జనసేన, టీడీపీ అడ్రస్ లేకుండా పోతాయని మాజీమంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి చెప్పారు. ఒంగోలులోని తన నివాసంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ ఎన్నికల్లో టీడీపీ జాతీయ పార్టీ అయిన కాంగ్రెస్‌కు వత్తాసు పలికితే.. జనసేన మరో జాతీయ పార్టీ బీజేపీతో పొత్తుపెట్టుకుందన్నారు. ఏపీలో అనైతిక పొత్తు ద్వారా టీడీపీ–జనసేన ప్రజలను మభ్యపెట్టాలని చూస్తున్నాయని స్పష్టమవుతోందన్నారు. ఇటువంటి నైతికతలేని పొత్తులను ఆంధ్రా ప్రజలు అంగీకరించరని చెప్పారు. కాంగ్రెస్ గెలుపు తమ వల్లే అంటూ టీడీపీ వాళ్లు చేసుకున్న ప్రచారం పూర్తిగా అవాస్తవమన్నారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ఉన్న ఆంధ్రా సెటిలర్స్ అంతా బీఆర్‌ఎస్‌కే మద్దతు పలికి గెలిపించారని.. కనీసం కాంగ్రెస్‌కు ఒక్క సీటు కూడా దక్కలేదని చెప్పారు. టీడీపీతో పొత్తు వల్లే తెలంగాణలో కాంగ్రెస్‌కు ఆంధ్రా సెటిలర్స్ దూరం అయ్యారన్నారు. టీడీపీ కూడా ఫలితాలు వెలువడిన ఒకటి రెండు రోజులు హడావుడి చేసి.. ఆ తరువాత జనానికి విషయం అర్థం అయిందని తెలియగానే గప్‌చుప్ అయిందని చెప్పారు. టీడీపీ అంటేనే ఆంధ్రా ప్రజానీకం అసహ్యించుకునే పరిస్థితి నెలకొందన్నారు. టీడీపీ వారు రోడ్డు మీదకు రావడాన్ని తట్టుకోలేకనే తెలంగాణలో కాంగ్రెస్‌కు దూరంగా ఉన్నారని, రేపు ఆంధ్రాలో జరిగే సాధారణ ఎన్నికల్లో టీడీపీ అడ్రస్ కూడా గల్లంతవుతుందని చెప్పారు.



వైఎస్సార్ జిల్లా కమలాపురం చెన్నూరులో జరిగిన సభకు హాజరైన అశేష జనసందోహంలో ఓ భాగం

కమలాపురం.. జనసంద్రం

- చెన్నూరు సభకు పోటెత్తిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు
- డప్పుల చప్పుళ్లతో, ఆటపాటలతో ప్రాంగణానికి చేరిక
- నేతలు సీఎం జగన్ పేరు ప్రస్తావించగానే.. సభికుల చప్పట్లు,
- అణగారిన వర్గాల ఆశా జ్యోతి జగనేనని నేతల ప్రశంసలు

మరిన్ని వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

సాక్షి ప్రతినిధి, కడప: వైఎస్సార్ జిల్లా కమలాపురం నియోజకవర్గంలో ఆదివారం నిర్వహించిన సామాజిక సాధికార యాత్రకు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు పోటెత్తారు. చెన్నూరులో నిర్వహించిన బహిరంగ సభకు జనం వెల్లువలా తరలివచ్చారు. వివిధ గ్రామాల నుంచి డప్పుల దరువులు, ఆటపాటలతో ప్రజానీకం ర్యాలీగా ప్రాంగణం వద్దకు చేరుకున్నారు. ఇలా వేలాది మంది తరలి రావడంతో సభాస్థలిలో అందరూ కూర్చునే పరిస్థితి లేకుండా పోయింది. వెరసి చెన్నూరులో ఎటు చూసినా, ఏ వీధిలో చూసినా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు వైఎస్సార్‌సీపీ జెండాలను రెపరెపలాడిస్తూ కనిపించారు. కమలాపురం ఎమ్మెల్యే పోచంరెడ్డి రవీంద్రనాథరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో నాయకులు తమ ప్రసంగాల్లో సీఎం జగన్ పేరును ఉచ్చరించగా.. సభికులు పెద్దపెట్టున హర్షధ్వానాలు చేశారు.

అంబేడ్కర్ ఆలోచన విధానాలు అమలు

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, జ్యోతిరావ్ పూలే, కొమురం భీమ్ వంటి మహనీయుల ఆలోచనలను అమలు చేసిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డేనని విద్యా శాఖ మంత్రి ఆదిమూలపు సురేశ్ అన్నారు. అణగారిన వర్గాలకు అండగా, భావి తరాల ఉన్నతికి దూరదృష్టితో పెద్దపీట వేస్తున్న వైఎస్ జగన్‌ను మరోమారు మన కోసం ముఖ్యమంత్రిగా చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కామెడీ యాక్టర్ పవన్, నయవంచకుడు చంద్రబాబు కలిసికట్టుగా వస్తున్నారని, వారి మాయమాటలు నమ్మొద్దని సూచించారు.



పాడేరులో ఉదయం 9 గంటలకు కురుస్తున్న పొగమంచు

చింతపల్లిలో 11, అరకులో 12.3 డిగ్రీలు

అల్లూరి జిల్లాలో గణనీయంగా తగ్గుతున్న ఉష్ణోగ్రతలు

సాక్షి,పాడేరు: అల్లూరి సీతారామరాజు జిల్లా వ్యాప్తంగా పొగమంచు దట్టంగా కురుస్తోంది. ఉదయం 9 గంటల వరకు పాడేరు, చింతపల్లి, అరకులోయ ప్రాంతాల్లో మంచుతెరలు వీడటం లేదు. ఘాట్ ప్రాంతాల్లో దట్టమైన పొగమంచు కారణంగా లైట్ల వెలుగులో వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. ఉష్ణోగ్రతలూ రోజురోజుకూ తగ్గుముఖం పడుతున్నాయి. చింతపల్లి వ్యవసాయ పరిశోధన స్థానంలో శనివారం 15.5 డిగ్రీలు నమోదు కాగా ఆదివారం 4.5 డిగ్రీలు తగ్గి 11 డిగ్రీలు నమోదైంది. అరకులోయ కేంద్ర కాఫీ బోర్డులో 12.3 డిగ్రీలు, పాడేరు మండలంలోని మినుములూరు కేంద్ర కాఫీ బోర్డు వద్ద 13 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదైనట్లు కాఫీబోర్డు వర్గాలు తెలిపాయి. ఆయా ప్రాంతాల్లో సాయంత్రం నుంచి చలిగాలులు విజృంభిస్తున్నాయి.

మంచు అందాలకు ఫిదా...

జిల్లా వ్యాప్తంగా చలిగాలుల తీవ్రత ఉన్నప్పటికీ మంచు అందాలను తిలకించేందుకు పర్యాటకులు ఎక్కువగా ఆసక్తి చూపుతున్నారు. తెలుగు రాష్ట్రాలతో పాటు ఇతర ప్రాంతాల నుంచి పర్యాటకులు భారీగా తరలివచ్చి అందాలను వీక్షిస్తూ పరవశిస్తున్నారు. మారేడుమిల్లి ప్రాంతంలోని గుడిసె, చింతపల్లి మండలంలోని లంబసింగిలోని చెరువులవెనం, పాడేరు మండలంలోని వంజంగి హిల్స్, హుకుంపేట మండలంలోని సీతమ్మకొండ, అరకులోయ మండలంలోని మాడగడ హిల్స్ ప్రాంతాలకు వేకువజామునే చేరుకుని పొగమంచు, సూర్యోదయం, మేఘాల అందాలను వీక్షిస్తున్నారు.



మాడగడ హిల్స్‌లో పర్యాటకులు

నెట్టెంపాడు ఎత్తిపోతల నీటి పంపింగ్ ప్రారంభం

జూరాలకు స్వల్పంగా పెరిగిన ఇన్‌ఫ్లో



లిఫ్టు-1 గుడ్డెందొడ్డి వద్ద నెట్టెంపాడు ఎత్తిపోతల పథకంలో ప్రారంభమైన నీటి పంపింగ్

ధరూరు: నెట్టెంపాడు ఎత్తిపోతల పథకంలో ఒక పంపు ద్వారా నీటి పంపింగ్‌ను ప్రారంభించినట్లు పీజేపీ అధికారులు తెలిపారు. ఇదిలా ఉండగా.. ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ ప్రాంతం నుంచి వస్తున్న ఇన్‌ఫ్లోలు స్వల్పంగా పెరిగినట్లు తెలిపారు. ఆదివారం సాయంత్రం 6 గంటల వరకు ప్రాజెక్టుకు కేవలం 1904 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉన్నట్లు చెప్పారు. నెట్టెంపాడు ఎత్తిపోతలకు 375 క్యూసెక్కులు, ఆవిరి రూపంలో 67 క్యూసెక్కులు, ఎడమ కాల్వకు 390 క్యూసెక్కులు, కుడి కాల్వకు 401 క్యూసెక్కులు ప్రాజెక్టు నుంచి మొత్తం 1,233 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. జూరాల ప్రాజెక్టు పూర్తి స్థాయి నీట్టిం 9.657 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం ప్రాజెక్టులో 8.087 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు.

పదవీ గండమేనా..?



గద్వాల జిల్లాలోని జమ్మిచేడు జములమ్మ ఆలయం

- జిల్లా వ్యాప్తంగా దేవాదాయశాఖ ఆలయ కమిటీల్లో మొదలైన ఆందోళన
- ప్రభుత్వం మారడంతో సందేహం

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 51 ఆలయాలు

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా దేవాదాయ శాఖకు ఆదాయం చేకూర్చే ఆలయాలు 51 ఉండగా, ఇందులో సుమారు 23 ఆలయాలకు పాలక మండలీలు నియామకం కాబడ్డాయి. కొన్ని ఆలయాలు వంశపారంపర్య కమిటీలు కొనసాగుతుండగా, మరికొన్ని ఆలయాల్లో గత ప్రభుత్వం ఐదు నెలల క్రితమే పాలకమండలిని నియమించింది.

జోగుళాంబ శక్తిపీఠం: రాష్ట్ర దేవాదాయశాఖలో నామినేటెడ్ పదవి కింద ఆలయ పాలకమండలిని గత ప్రభుత్వం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసింది. ఏడాది కాల పరిమితితో నియామకమైన ఈ కమిటీలు ఆరు నెలలు కూడా పూర్తి చేసుకోకముందే కొత్త ప్రభుత్వం ఏర్పాటు కావడంతో తమ పాలకమండలి నిలబడుతుందా లేక రద్దు అవుతుందా? అని లోలోపల మదనపడుతున్నారు. కాగా దేవదాయశాఖలో పాలకుర్తి దేవస్థానం చైర్మన్ రామచంద్రయ్య శర్మ రాష్ట్రంలో అధికార మార్పిడి నేపథ్యంలో తన పదవికి స్వచ్ఛందంగా రాజీనామ చేయడంతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రముఖ ఆలయాల్లో ఈ విషయం హాట్ టాపిక్‌గా మారింది.

రహస్యంగా విచారణ

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న పలు ప్రముఖ ఆలయాల్లో నామినేటడ్ పదవులు ఉంటాయా లేక ఊడతాయా? అంటూ చైర్మన్‌లు, ధర్మకర్తలు అక్కడి ఈవోలను రహస్యంగా విచారణ చేస్తుండటం గమనార్హం. తమ హయాంలో ఆలయాలను ఎంతో అభివృద్ధి చేద్దామని కొండంత ఆశతో కొలువుదీరిన ఆలయ పాలకమండలి సభ్యులు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను గెలిపించేందుకు గాను ఆ పనిలో నిమగ్నం అవడంతో ఆలయాల అభివృద్ధికి వారికి సమయాభావం లభించలేదు. తీరా కొత్త ప్రభుత్వం కొలువు దీరడంతో పాత కమిటీలకు ఒకింత ఆందోళన మొదలైంది.

వారం, పది రోజుల్లో అధికారిక ఉత్తర్వులు?

ఈ విషయంపై ప్రస్తుతం అధికారుల నుంచి ఎలాంటి ఆదేశాలు లేవు. మరో, వారం రోజులలో కాంగ్రెస్ ప్రభుత్వం సూచన మేరకు రాష్ట్ర దేవాదాయ శాఖ గత పాలక ప్రభుత్వంలో నియమితమైన ఆలయ పాలకమండలి కొనసాగాలా వద్దా? అనే అంశంపై స్పష్టమైన వివరణతో ఉత్తర్వులు జారీ చేయనున్నట్టు దేవదాయశాఖ ప్రధాన కార్యలయంలోని ఓ సీనియర్ ఉద్యోగి వెల్లడించారు.

కురుమతిగిరులు కిటకిట



జాతర మైదానంలో భక్తుల రద్దీ

- మార్మోగిన గోవింద నామస్మరణ
- జాతర ప్రాంగణం జనసంద్రం

చిన్నచింతకుంట: పేదల ఆరాధ్య దైవం అమ్మాపురం కురుమూర్తిస్వామి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. ఆదివారం సెలవురోజు కావడంతో వివిధ ప్రాంతాల భక్తులు కుటుంబ సమేతంగా తరలిరావడంతో రద్దీ నెలకొంది. తెల్లవారుజామున అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం భక్తులను దర్శనానికి అనుమతించారు. కోనేరులో స్నానాలు ఆచరించిన భక్తులు దర్శనానికి బారులు తీరారు. పలువురు భక్తులు గండదీపాలు మోసి పచ్చిపులుసు, అన్నం నైవేద్యంగా సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. మరికొందరు తలనీలాలు సమర్పించి, మెట్లపై దీపాలు వెలిగిస్తూ స్వామివారిని దర్శించుకున్నారు. కొండ దిగువన జాతర మైదానంలో ఏర్పాటు చేసిన దుకాణాలు, హోటళ్లకు కొనుగోలుదారుల తాకిడి కనిపించింది. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు.

జోరుగా మాంసం విక్రయాలు..

ఆదివారం సెలవురోజు కావడంతో జాతరకు మాంసం ప్రియులు అధికసంఖ్యలో తరలివచ్చారు. మిత్రులు, కుటుంబసభ్యులతో కలిసి కాల్చిన మాంసం కొనుగోలు చేసి ఆరగించారు.



స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు



క్యూలైన్‌లో బారులు తీరిన భక్తులు

స్వామివారిని దర్శించుకున్న అచ్చంపేట ఎమ్మెల్యే..

కురుమూర్తిస్వామిని ఆదివారం అచ్చంపేట ఎమ్మెల్యే డా. వంశీకృష్ణ దర్శించుకున్నారు. అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి ప్రత్యేక పూజల అనంతరం శాలువాతో సత్కరించారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు తదితరులు ఉన్నారు.

జోగుళాంబ ఆలయాల్లో రద్దీ

- ప్రముఖుల రాకతో అవస్థలు పడిన సామాన్యులు
- రూ.3.50 లక్షలు సమకూరిన ఆదాయం





ఆలయంలో భక్తుల రద్దీ,జోగుళాంబ సన్నిధిలో గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి

జోగుళాంబ శక్తి పీఠం: కార్తీకమాసం ముగియనుండటం, ఆదివారం సెలవు కావడంతో వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తండోపతండాలుగా అలంపూర్ ఆలయాలకు చేరుకున్నారు. సామాన్య భక్తులతో పాటుగా వివిధ సమయాలలో ప్రముఖులు సైతం దర్శనాలకు వచ్చారు. దీంతో దేవస్థాన అధికారులు ఆలయ మర్యాదల పేరిట ప్రముఖులకు పెద్దపీఠ వేస్తూ సామాన్య భక్తులను విస్మరించారని భక్తులు పెదవి విరిచారు. ప్రసాద విక్రయశాలలో పులిహోరలో నాణ్యత కొరవడిందని సిబ్బందితో వాదనకు దిగారు. కొంతమంది భక్తులు కార్యాలయానికి చేరుకుని లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు.

అన్నదాన సత్రంలో భక్తుల అవస్థలు

బ్రహ్మేశ్వర నిత్యాన్నదాన సత్రంలో సుదూర ప్రాంతాల నుంచి తరలి వచ్చిన భక్తులకు అన్నదానం చేశారు. కాగా అన్నదాన సత్రంలో స్థలం కొరత కారణంగా భక్తులంతా ప్లేట్లు ఒక చేతిలో పట్టుకుని మరొక చేతిలో పిల్లపాపలతో నిల్చొని భోజనాలు చేయలేక ఇబ్బందులు పడ్డారు. ఇంత పెద్ద ఆలయంలో లగేజీలు భద్రపరుచుకునేందుకు కనీసం లాకరు సదుపాయాలు కూడా ఏర్పాటు చేయలేకపోవడం విడ్డూరం అంటూ ఆలయ నిర్వహణ తీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. అలంపూర్ ఆలయాలను దర్శించుకుందామని వచ్చిన తమకు ఇక్కడ అసౌకర్యాలు అడుగడుగునా స్వాగతం పలికాయని భక్తులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై ఆలయ అధికారి పురేందర్ కుమార్‌ను వివరణ కోరగా రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ప్రముఖ క్షేత్రాలలో ఆది, సోమవారాలలో భక్తుల రద్దీ అధికంగా ఉంటుందని, భక్తులు సంయమనం పాటించి ప్రశాంతకరమైన దర్శనాల కోసం దేవస్థాన వారి సూచనలు పాటించాలని కోరారు. అదేవిధంగా అన్నదాన సత్రంలో స్థలం కొరత కారణంగా భక్తులు ఇక్కట్లకు గురవుతున్న విషయం వాస్తవమేనని, త్వరలో సమస్యకు శాశ్వత పరిష్కారానికి చొరవ చూపుతామని తెలిపారు. ఇదిలా ఉండగా దేవస్థానానికి భక్తుల ద్వారా రూ.3,54,214 ఆదాయం చేకూరింది. కార్తీకమాసం కావడంతో భక్తులు ఆలయాల వద్ద కార్తీక దీపాలు వెలిగించేందుకు పోటీ పడ్డారు. దీంతో ఆలయాలు భక్తుల రద్దీతో కిక్కిరిశాయి.

బొటానికల్ గార్డెన్ సందర్శించిన డిప్యూటీ డైరెక్టర్



బొటానికల్ గార్డెన్‌లో మొక్కనాటి నీటిని పోస్తున్న రాంసింగం

జడ్చర్ల టౌన్: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని బొటానికల్ గార్డెన్‌ను బొటానికల్ సర్వే ఆఫ్ ఇండియా డెక్కన్ రీజినల్ సెంటర్, హైదరాబాద్ డిప్యూటీ డైరెక్టర్ డా.రాంసింగం ఆదివారం సందర్శించారు. ఆయనకు గార్డెన్ సమన్వయకర్త డా.సదాశియ్య, వృక్షశాస్త్ర విభాగ అధిపతి శ్రీనివాసులు, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు ఘన స్వాగతం పలికారు. కేంద్ర ప్రభుత్వం బొటానికల్ గార్డెన్‌లకు అందించే సహాయానికి డిగ్రీ కళాశాల బొటానికల్ గార్డెన్ ఎంపిక చేయాలా వద్దా విషయాలపై అధ్యాయనం చేసేందుకు ఆయన వచ్చారు. గార్డెన్‌లోని సదుపాయాలను అడిగి తెలుసుకున్నారు. అరుదైన మొక్కలను చూసి అభినందించారు. గార్డెన్‌కు కేంద్ర ప్రభుత్వ సాయం అందే అవకాశాలు ఉన్నాయని ఆయన ప్రకటించారు.

నల్లమలలో వాహనాల రద్దీ

దోమలపెంట: కార్తీక మాసంలో ఆఖరి సోమవారం, మంగళవారం కార్తీక అమావాస్య ఆకాశ దీప వ్రతం పరిసమాప్తి కానుండటంతో శ్రీశైలం మల్లన్నస్వామి దర్శనానికి, కృష్ణానదిలో పుణ్యస్నానాలు ఆచరించడానికి భక్తులు తరలివస్తున్నారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు వస్తుండటంతో నల్లమలలో వాహనాల రద్దీ నెలకొంది. అలాగే శ్రీశైలం వైపు వెళ్లే ఆర్టీసీ బస్సులన్నీ భక్తులతో కిటకిటలాడుతున్నాయి. ఆదివారం సాయంత్రం ఈగలపెంట నుంచి ఎడమ పాతాళగంగ వరకు ట్రాఫిక్ అంతరాయం కలిగింది. ట్రాఫిక్ పోలీసులు ఎవరూ లేకపోవడం, వాహనాలు ఎక్కడపడితే అక్కడే ఆపుతుండటంతో వాహనాలు భారీగా నిలిచిపోతున్నాయి.



ఈగలపెంటలో నిలిచిపోయిన వాహనాలు